GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- వచ్చే దీపావళి నాటికి హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలు పూర్తి
- రాజేంద్రనగర్‌లో పారదర్శకంగా లక్కీడ్రా ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో దీపావళి వెలుగులు



2

అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

మూడు సర్వే నంబర్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



4

ఇసుక క్వారీల్లో వసూళ్ల లెక్కేంటి?

- క్రైమ్ మిర్రర్ కథనంతో తగ్గిన లోడింగ్ చార్జీలు, మళ్లీ పెంపుపై ప్రజల్లో చర్చ
- తగ్గిన చార్జీలు మళ్లీ పెరగడానికి కారణమేంటి?
- క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్
- అధికారుల మౌనం, పర్యవేక్షణపై అనేక అనుమానాలు!

క్రైమ్ మిర్రర్ ఎఫెక్ట్..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాడేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల్లో లోడింగ్ చార్జీలు వసూళ్ల వ్యవహారం మరోసారి చర్లనీయాంశంగా మారింది. అడనపు వసూళ్లపై క్రైమ్ మిర్రర్ వెలువరించిన కథనం తర్వాత లోడింగ్ చార్జీలు తగ్గినప్పటికీ, ఆ తగ్గింపు ఎంతోకాలం కొనసాగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి



2

అధికారుల మౌనం.. పర్యవేక్షణపై అనుమానాలు!

ఇసుక క్వారీల్లో వసూళ్ల లెక్కేంటి?

ఇటీవల క్వారీల్లో ఒక్కో వాహనానికి లోడింగ్ చార్జీల పేరుతో రూ.3,000 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై క్రైమ్ మిర్రర్ ప్రజా ప్రయోజన కథనం ప్రచురించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో కదలికలు చేపట్టారు. ఫలితంగా చార్జీలు రూ.3,000 నుంచి రూ.1,600కు తగ్గినట్లు సమాచారం. అయితే కథనం ప్రభావంతో తగ్గినట్లు భావించిన ఈ వసూళ్లు మళ్లీ పాత దారిలోకి వెళ్లాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈరోజు మధ్యాహ్నం వరకు రూ.1,600గా ఉన్న లోడింగ్ చార్జీలు, మధ్యాహ్నం తర్వాత మళ్లీ రూ.2,000కు చేరినట్లు సమాచారం. మండలంలోని పలు ఇసుక క్వారీల్లో ఇదే తరహా పరిస్థితి కొనసాగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గించిన చార్జీలు మళ్లీ ఎందుకు పెరిగాయి?

ఒకవైపు అదనపు వసూళ్లపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంటే, మరోవైపు చార్జీల తగ్గింపు, తిరిగి పెంపు వ్యవహారం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. అసలు లోడింగ్ చార్జీలకు నిర్ణయించిన అధికారిక ధర ఎంత? ఎవరి ఆదేశాల మేరకు ఈ మొత్తాలు వసూలు చేస్తున్నారు? నిర్ణీత ధరలకు మించి వసూలు చేస్తున్నట్లయితే ఆ మొత్తాలకు లెక్కలు ఏమిటి? ఇసుక కొనుగోలు చేసే వాహనదారులకు పారదర్శకంగా రసీదులు అందిస్తున్నారా? అదనపు మొత్తాల వసూళ్లపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారిస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు మండల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

అధికారుల మౌనం.. ఎవరికి లాభం?

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల వివరణ కోరినప్పటికీ స్పందన లేకపోవడం మరింత చర్చకు దారితీస్తోంది. క్వారీల్లో జరుగుతున్న వసూళ్లపై పర్యవేక్షణ బాధ్యత కలిగిన శాఖలు వాస్తవ పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నాయా లేదా అన్నది తేల్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. వాహనదారులు అదనపు భారం మోయాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? చార్జీలు ఒకసారి తగ్గి మళ్లీ పెరగడానికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు మహాదేవపూర్ మండలంలోని అన్ని ఇసుక క్వారీలపై సమగ్ర క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారిక లోడింగ్ చార్జీల వివరాలను బహిరంగంగా ప్రకటించడంతో పాటు, వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదనపు వసూళ్లు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం మీడియా బాధ్యత. ఆ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం అధికార యంత్రాంగం బాధ్యత. ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతున్నప్పుడు సంబంధిత శాఖలు మౌనంగా ఉండటం ఎంతవరకు సమంజసం ఇది ఒక్క ఇసుక క్వారీ సమస్య మాత్రమే కాదు.. ప్రభుత్వ ఆదాయం, ప్రజల ప్రయోజనం, అధికారుల జవాబుదారీతనానికి సంబంధించిన అంశం.

పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మహేశ్వరం నియోజకవర్గంలో గురువారం జల్‌పల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని మైలార్‌దేవ్‌పల్లిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా, కేటాయింపుల కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎకరా రూ.250 కోట్ల నుంచి రూ.270 కోట్ల వరకు విలువ చేసే అత్యంత ఖరీదైన భూముల్లో సైతం పేదల కోసం ఇందిరమ్మ టవర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. పేదలను నగరానికి దూరంగా పంపకుండా, వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అన్ని మౌలిక సదుపాయాలతో ఇళ్లు నిర్మించి అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టామని, వచ్చే దీపావళి నాటికి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ, కుల, మత వివక్షకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్‌లో చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మొదటి విడతలో ఇళ్లను కేటాయించామని, మొదటి విడతలో ఇళ్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాబోయే రెండు, మూడు, నాలుగు విడతల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు, 4.50 లక్షల మందికి కొత్త ఆసరా పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఆడబిడ్డలకు చీలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆత్మగౌరవానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన గృహాలను నిర్మించి అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా, విలువైన భూముల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు.



నాదర్‌గుల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి : వల్లపు సుభాన్ యాదవ్

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) : మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, రంగారెడ్డి డిడిసి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ కి నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళని కలిసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రెజర్ కాలనీ--2, సిద్ధార్థ కాలనీ, వివేకానంద కాలనీ, సెవెన్ హిల్స్ కాలనీలలో సీసీ రోడ్లు నిర్మించాలని, బృందావన్ కాలనీ, వెంకటాద్రి కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాదర్ గుల్ నుండి గాంధీ నగర్ వరకు మెయిన్ రోడ్ పూర్తి చేయాలని, నాదర్‌గుల్ డివిజన్‌లోని మిగిలిన కాలనీల్లో కూడా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించి, అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పుట్టగళ్ల జగన్, 57వ డివిజన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మహేశ్వరం ఖీజ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంకంగారి వెంకటేష్ గౌడ్, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ ,దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం పురాతన కట్టడాల పరిరక్షణకు సహకరిస్తా

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో పలు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, నారాయణపురం మండల కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం శిథిలం అవుతున్న పురాతన కట్టడాల గురించి వివరించారు. సానుకూలంగా స్పందించి ఇలాంటి అద్భుతమైన కట్టడాలను మన భావితరాలకు అందించాలంటే కట్టడాలను కాపాడుకోవాలని అన్నారు వెంటనే సంబంధిత అధికారతో ఫోన్లో మాట్లాడి సంస్థాన్ నారాయణపురం గ్రామ పురాతన కట్టడాల కాపాడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ నవీన్ కుమార్, నారాయణపురం మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు సూరపల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, ఎండి అలిమ యూసఫ్, సభావత రఘునాయక్, చింతల శైలజ సత్యనారాయణ, సింగం భిక్షపతి, సింగపంగా ప్రశాంతి రమేష్, నీళ్ళ అనిత శంకర్, బల్గూరి శివసాగర్, పట్నం బాలకృష్ణ గౌడ్, నారాయణపురం పద్మశాలి సహకార సంఘం చైర్మన్ చిలుకూరి శ్రీనివాస్, యువన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు గౌడ్, వడ్డేపల్లి శివప్రసాద్, బానోతు కిరణ్ నాయక్,గణేష్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ ఏర్పాట్ల విషయమై అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శన

నేడు ఏచూరి గార్డెన్లో పింఛన్ల పంపిణీ నల్లగొండ నియోజకవర్గం

నల్లగొండ క్రైమ్ మిర్రర్: ఈనెల 13 న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్లో నిర్వహించనున్న నల్గొండ నియోజకవర్గ స్థాయి చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ ఏర్పాట్ల విషయమై గురువారం కలెక్టర్ అధికారులతో కలిసి ఏచూరి గార్డెన్ ను సందర్శించారు.నల్గొండ నియోజకవర్గ పరిధిలోని మండలాలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని పెన్షన్ లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమానికి హాజరవుతారని, అందువల్ల పెన్షన్ల పంపిణీకి వచ్చే లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, శానిటేషన్, హెల్ప్ డెస్క్ , కౌంటర్లు ఏర్పాటు చేసి ఆయా మండలాల వారిగా లబ్ధిదారుల జాబితా రూపొందించి వారికి ఎక్కడ పెన్షన్లు పంపినిచేస్తారో సులభంగా తెలుసుకునేలా ఏర్పాటు చేయాలని చెప్పారు.అలాగే పబ్లిక్ అడ్రస్ సిస్టం , మాండలాలు, మున్సిపల్ కార్పోరేషన్ డివిజన్ల వారిగా లబ్ధిదారుల జాబితాల రూపకల్పన, భోజనం తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని , ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ విషయాన్ని ముందుగానే లబ్ధిదారులకు తెలియజేయాలని, ఆనర్హులకు ఎట్టి పరిస్థితులలో పెన్షన్లు పంపిణీ చేయకూడదని, ముందే జాబితాలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని చెప్పారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి,ఆర్ బి శాఖ మంత్రి పి ఏ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, తదితరులు ఉన్నారు .

నీటి సంరక్షణే లక్ష్యంగా కర్మల్ పహాడ్‌లో ఇంకుడు గుంతల నిర్మాణం

ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని సర్పంచ్ తేజీరాం నాయక్ పిలుపు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణే లక్ష్యంగా కర్మల్ పహాడ్ గ్రామ పంచాయతీలో ఇంటికో ఇంకుడు గుంత నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించవచ్చని గ్రామ సర్పంచ్ బాణావత్ తేజీరాం నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై అధికారులు, పంచాయతీ సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీఓ లాలయ్య మాట్లాడుతూ.. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి మళ్లిస్తే భూగర్భ జలమట్టం పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకుని నీటి సంరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య, ఎఫ్ఏ శ్రీను, వీరయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15న నల్లగొండలో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయండి

-- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా



క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- అఖిల భారత రైతు సంఘం జాతీయ 36 మహాసభల సందర్భంగా ఈనెల 15 వ తేదీన నల్లగొండ ఎన్.జి కాలేజీ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో రైతులు, కౌవులు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సీపీఎం శాఖ సమావేశం మరియు బహిరంగ సభ పోస్టర్ ను ఆవిష్కరణ చేసిన అనంతరం నర్సింహ పాల్గొని మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పురిటిగడ్డ అయిన నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుండి 18 వరకు అఖిల భారత కిసాన్ సభ 36 జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల రోజు వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వెలిబుచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరలు కల్పిస్తామని, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని వారు ఆరోపించారు. గతంలో 750 మంది రైతుల ప్రాణత్యాగంతో రద్దు చేయించిన మూడు నల్ల చట్టాలను, విద్యుత్ సవరణ బిల్లును దొడ్డిదారిన మళ్లీ అమలు చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను రైతులు ఐక్యంగా రైతాంగం ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ఆక్వా, పౌల్ట్రీ, పాడి, ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇది దేశ ఆహార భద్రతకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వం అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. ఉచిత పంటల బీమా అమలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం, వ్యవసాయ మోటార్లకు మీటర్ల రద్దు, బలవంతపు భూసేకరణ నిలిపివేత వంటి ప్రధాన అంశాలపై రాజీలేని పోరాటం సీపీఎం, రైతు సంఘం సాగిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని కాపాడుకుందాం – రైతును రక్షించుకుందాం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ మహాసభల్లో భవిష్యత్ పోరాట రూపాలను, ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించనున్నట్లు తెలిపారు. రైతుల హక్కుల కోసం 15 వ తేదీన నిర్వహిస్తున్న బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం నర్సింహ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి కొండ అశోక్, మండల కార్యదర్శివర్గ సభ్యురాలు కొండమడుగు నాగమణి, గ్రామ నాయకులు రైతులు కూకుట్ల కృష్ణ , కొండ లక్ష్మయ్య , కాసారం మల్లయ్య , కొండ ఐమావతి, కుకుట్ల చొక్కా కుమారి, గౌటి శారదమ్మ, బొడుసు పద్మ, కొండమడుగు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో గ్రామానికి అంబులెన్స్ అందించిన మాజీ సర్పంచ్ సోలిపేట బలవంత్ రెడ్డి

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అంబులెన్స్ బహూకరణ.. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట



క్రైమ్ మిర్రర్ చేవెళ్ల: గ్రామ ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఓ మాజీ సర్పంచ్ తన ఉదారతను చాటుకున్నారు. కన్నవారిపై ఉన్న ప్రేమాభిమానాలను సమాజ సేవ రూపంలో చాటుతూ, తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో గ్రామానికి అంబులెన్స్‌ను బహూకరించారు. చేవెళ్ల మండలం, చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కండవాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోలిపేట బలవంత్ రెడ్డి ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా, గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడాలనే సంకల్పంతో అంబులెన్స్‌ను అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బలవంత్ రెడ్డి మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామ ప్రజలకు అంబులెన్స్ అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అంబులెన్స్ కేవలం కండవాడ గ్రామానికే పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాదాలు, అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేందుకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై గ్రామంలో రూ. 33 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే కండవాడ గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్తుంటారని, ఈ క్రమంలో పాము కాటు, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు బాధితులకు తక్షణ వైద్యసేవలు అందించడం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు అంబులెన్స్ సేవలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సొంత నిధులతో అంబులెన్స్‌ను అందించిన సోలిపేట బలవంత్ రెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.సాధారణంగా వ్యక్తిగత జ్ఞాపకాలను కుటుంబానికే పరిమితం చేయకుండా, వాటిని ప్రజాసేవకు అనుసంధానం చేయడం గొప్ప విషయమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. కండవాడతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా ఈ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రావడం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య అత్యవసర సేవలకు మరింత భరోసా కల్పించనుంది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సోలిపేట బలవంత్ రెడ్డి, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హర్ష సాయి ట్రస్ట్ పేరుతో సైబర్ మోసం..!!

- రూ.2 వేలు ఫోన్ పే చేస్తే రూ.18,500 ఇస్తామంటూ మాయాజాలం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న ఎస్సై సాంబమూర్తి


క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో 'హర్ష సాయి ట్రస్ట్' పేరుతో సాగుతున్నట్లు ప్రచారంలో ఉన్న సైబర్ మోసంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి హెచ్చరించారు. రూ. 2,000 ఫోన్ పే చేస్తే ఏకంగా రూ. 18,500 పంపిస్తామంటూ కొందరికి ఆశ చూపుతున్నట్లు సమాచారం. తక్కువ మొత్తాన్ని పంపిస్తే భారీ మొత్తం తిరిగి వస్తుందనే ఆశతో ఎవరైనా డబ్బులు పంపితే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని పోలీసులు సూచిస్తున్నారు.

అత్యాశే సైబర్ నేరగాళ్ల ఆయుధం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా ట్రస్ట్ పేరును ఉపయోగిస్తూ నమ్మకం కలిగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఎస్సై సాంబమూర్తి హెచ్చరికలు..





మహాదేవపూర్ మండల ప్రజలు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాంబమూర్తి సూచించారు. ఎలాంటి ధృవీకరణ లేకుండా ఎవరికీ ఫోన్ పే ద్వారా డబ్బులు పంపవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ప్రజలకు పోలీసుల సూచన ఒక్కటే.. ఆశపెట్టి డబ్బులు అడిగే ఆన్‌లైన్ ఆఫర్లను నమ్మవద్దు. మీ అప్రమత్తతే మీ ఆర్థిక భద్రతకు రక్షణ!

అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

మూడు సర్వే నంబర్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేపట్టడంతో అక్రమ నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది. అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 991, 630, 1042లో ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. సంబంధిత సర్వే నంబర్ల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములు, చెరువుల పరిధి, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలో ఇటీవలి కాలంలో భూముల విలువలు పెరగడంతో ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, చెరువుల పరిసర ప్రాంతాలపై ఆక్రమణల సమస్య తరచూ తెరపైకి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను గుర్తించే ప్రక్రియ చేపడుతోంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడంతో పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన స్థలాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములు, చెరువుల స్థలాలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో ముందస్తు అనుమతులు, సంబంధిత భూముల రికార్డులు, సర్వే వివరాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలకు పాల్పడినా, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.







కాగా, సర్వే నంబర్లు 991, 630, 1042లో చేపట్టిన కూల్చివేతలతో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మండల పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మియాపూర్‌లో మెగా మెడికల్ క్యాంప్ - ఉచిత వైద్య సేవలు, ఉచిత మందులు



క్రైమ్ మిర్రర్ మియాపూర్: మానవసేవయే మాధవ సేవ అనే నినాదంతో యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ ఘనంగా నిర్వహించబడుతోంది. మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ సౌజన్యంతో, నివృతి హోమ్స్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈ క్యాంప్ జరగనుంది.తేదీ: శనివారం, 14 నవంబర్ 2026 సమయం: ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 3:00 వరకు వేదిక: నివృతి హోమ్స్ కమ్యూనిటీ హాల్, సెంటియా గ్లోబల్ స్కూల్ ఎదురుగా, బి.కె. ఎన్‌క్లేవ్, మియాపూర్ క్యాంప్‌లో అందించబడే వైద్య సేవలు:

- ఈసీజీ (ఈసీజీ)
- బీపీ చెక్
- ఆర్‌బీఎస్ (చక్కెర పరీక్ష)
- బీఎంఐ (ఎత్తు-బరువు పరీక్ష)
- కంటి పరీక్ష
- ఈఎన్‌టీ పరీక్ష ఽ కన్సల్టేషన్ (చెవి, ముక్కు, గొంతు)
- కార్డియాలజీ కన్సల్టేషన్
- శిశువైద్యుల కన్సల్టేషన్ (పిల్లల కోసం)
- గైనకాలజీ కన్సల్టేషన్ (మహిళల కోసం)
- జనరల్ ఫిజిషియన్ కన్సల్టేషన్
- ఆర్థోపెడిక్ కన్సల్టేషన్

అవసరమైన వారికి ఉచిత మందులు మరియు ఉచిత వైద్య సేవలు అందించబడును. వైద్య శిబిరంలో వైద్యుల పరీక్షలలో ఏవైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు గుర్తించబడిన పక్షంలో, అవసరమైన చికిత్సను ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా అందించబడుతుంది. అంతేకాకుండా ఉచిత అడ్మిషన్, అవసరమైన మందులు పూర్తిగా ఉచితం, ఆసుపత్రి చికిత్స ఉచితం, రవాణా సౌకర్యం కూడా నిర్వాహకుల ఆధ్వర్యంలో కల్పించబడుతుంది. ఈ సేవలను మియాపూర్ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఽ చైర్మన్, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ కోరారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా స్పీడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మంద వేణుగోపాల్ రెడ్డి

చిట్యాల క్రైమ్ మిర్రర్: నల్గొండ జిల్లాలో స్పీడ్ హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ స్పీడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని నియమించింది. ఇందులో ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా మంద వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏలుగు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంద వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, మెరుగైన శిక్షణ అందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా జట్టు రాణించేలా కృషి చేస్తానని తెలిపారు. నూతన కమిటీ నియామకంపై క్రీడాకారులు, క్రీడా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు







పడకల్‌లో నూతన మెడికల్ షాప్ ప్రారంభం

యువత వ్యాపార రంగంలో రాణించి స్వయం ఉపాధి పొందాలి: సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో జోగు క్రాంతి కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన క్రాంతి రామ్ మెడికల్ షాప్‌ను గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా ఎదగడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. నూతనంగా మెడికల్ షాప్ ఏర్పాటు చేసిన క్రాంతి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, వార్డు సభ్యులు జోగు విజయ్ కుమార్, ఎండీ వాజిత్, సీహెచ్ విజయ్ కుమార్, నాయకులు లట్టుపల్లి జగ్గారెడ్డి, జెల్లెల శ్రీశైలం, సీపీఎం పెంటయ్య, తిరుపతి గౌడ్, లక్ష్మీనారాయణ, ఎండీ గౌస్, బి. రమేష్, శివకుమార్, పాండు, జోగు రామచంద్రయ్య, జోగు కృష్ణ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయం మా కుటుంబ వారసత్వం: ఈర్ల రాజు

పదిమందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం

మామిడి, జామ తోటలతో పాటు చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి

బీజేపీ నేత ఈర్ల రాజు ముదిరాజ్



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: వ్యవసాయం తమ కుటుంబానికి తరతరాలుగా వస్తున్న వారసత్వమని, రాజకీయాలతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి కూడా తన వంతు కృషి చేస్తానని బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం బూరుగుపల్లి గ్రామంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాగు చేస్తున్న మామిడి, జామ తోటలను, చేపల చెరువును పరిశీలించారు. తోటల్లో మొక్కల పెరుగుదల, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయం, జీవనాధారమని పేర్కొన్నారు. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని అన్నారు. వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో మామిడి, జామ తోటలతో పాటు చేపల పెంపకాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాజకీయాల్లో ప్రజాసేవ ఎంత ముఖ్యమో, వ్యవసాయ రంగంలో కష్టపడే వారికి ఉపాధి కల్పించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకుంటూ నీటిని పొదుపుగా వినియోగించడం, మొక్కలకు అవసరమైన పోషకాలను సరైన సమయంలో అందించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. యువత వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని, వ్యవసాయం లాభసాటిగా మారి రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవ తన బాధ్యత అని, వ్యవసాయం తన అభిరుచి అని, పదిమందికి ఉపాధి కల్పించడం తన సంకల్పమని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

పీఎం రాహత్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సకాలంలో మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 'పీఎం రాహత్' పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని 24 ఎంపానెల్డ్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సాంకేతిక సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ఎంపానెల్డ్ ఆసుపత్రులకు తరలించి, ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే విషయంలో ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు పథకంపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, సంబంధిత శాఖల అధికారులు, 24 ఎంపానెల్డ్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి చరణ్, ఎస్ఐసీ ప్రతినిధి, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ప్రవీణ్‌లు పీఎం రాహత్ పథకానికి సంబంధించిన ఈ-డీఏఆర్ అప్లికేషన్ వినియోగం, పనితీరు, నమోదు ప్రక్రియ తదితర అంశాలను వివరించారు.

కడ్తాల్‌లో 60 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం

గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభం



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి కడ్తాల్ : అయ్యప్ప స్వాముల శరణుఘోషతో కడ్తాల్ పట్టణంలోని శివాలయ ప్రాంగణం మారుమోగింది. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప, ఆంజనేయ స్వామి మాలధారులకు 60 రోజుల పాటు నిర్వహించనున్న నిత్య అన్నదాన (భిక్ష) కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కేరళకు చెందిన చందర్ నాయర్ గురుస్వామి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చందర్ నాయర్ గురుస్వామి, గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ అయ్యప్ప, ఇతర మాలధార స్వాములకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాల వల్ల పితృదేవతల ఆశీస్సులు లభించడంతో పాటు కుటుంబాలు సుఖసంతోషాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని పేదలకు, అవసరమైన వారికి సహాయం చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ కుటుంబ సభ్యులు గత 12 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న అన్నదాన సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించడం అభినందనీయమని పలువురు అతిథులు కొనియాడారు. అయ్యప్ప, ఆంజనేయ స్వామి మాలధారులైన గురుస్వాముల దివ్యహస్తాలతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా సుమారు 300 మంది అయ్యప్ప, ఆంజనేయ స్వామి మాలధారులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తి భావంతో సాగిన ఈ కార్యక్రమంలో గురుస్వాములు ధన్‌రాజ్, భీముడు, బిక్కు, విజయ్, శ్రీశైలం, వాస శ్రీను, మధు, వెంకటేష్ పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ట్రస్ట్ సభ్యుడు గంప శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ గుప్తా, యువజన సంఘం అధ్యక్షుడు వీరేందర్ గుప్తా, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అమృతం పాండు, నాయకులు కిరణ్, జగదీష్, చల్లంపల్లి మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి, ఆర్గనైజర్ కిరణ్, ఆదివాసీ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు..60 రోజుల పాటు కొనసాగనున్న ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా మాలధార స్వాములకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందించనున్నారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి..

లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్య నాయకుల సమక్షంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కడ్తాల్ మండలం సరికొండ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, ప్రస్తుత పీఏసీఎస్ డైరెక్టర్ యాదమ్మ లక్ష్మయ్య దంపతుల కుమారుడి నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

హత్నూరలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలి

నీటి సంరక్షణపై అవగాహన కల్పించిన అధికారులు

ప్రారంభించిన గ్రామ సర్పంచ్ నల్లోళ్ల ఎల్లయ్య

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చేయాలంటే ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకోవాల్సిన అవసరం ఉందని, వర్షపు నీటిని వృథాగా వదిలేయకుండా భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా హత్నూర గ్రామంలో వీబీజీ--రామ్--జీ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ నల్లోళ్ల ఎల్లయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిలో అధిక భాగం కాలువలు, రోడ్ల ద్వారా ప్రవహించి వృథాగా వెళ్లిపోతుంది. ఈ నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉంటుంది. బోర్లు, బావుల్లో నీటి నిల్వలు మెరుగుపడటంతో పాటు వేసవిలో నీటి ఎద్దడి సమస్యను కొంతవరకు తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పశుపోషణ, గృహ అవసరాలకు భూగర్భ జలాలు ఎంతో కీలకం కావడంతో వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి. ఇంకుడు గుంతలు అంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు ఏర్పాటు చేసే ప్రత్యేక నిర్మాణాలు. ఇళ్ల ఆవరణలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర అనువైన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. పైకప్పులపై పడిన వర్షపు నీటిని పైపుల ద్వారా ఇంకుడు గుంతలకు మళ్లించవచ్చు. గుంతల్లోకి చేరే నీటిలో మట్టి, చెత్తాచెదారం చేరకుండా ఫిల్టర్ ఏర్పాటు చేయడం అవసరం. గుంతలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, నీరు సక్రమంగా భూమిలోకి ఇంకేలా నిర్వహణ చేపట్టాలి. స్థానిక నేల స్వభావం, నీటి ప్రవాహాన్ని బట్టి సంబంధిత సాంకేతిక నిపుణుల సూచనలతో నిర్మాణం చేపట్టాలి. ప్రతి ఇంటి యజమాని, రైతు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వాహకులు తమ పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామ ప్రజలు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతల ఏర్పాటు ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రజా ఉద్యమంగా కొనసాగినప్పుడే భూగర్భ జలాల పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీ, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, కొండేగల్ల రవి కుమార్, పొట్లగల్ల ప్రవీణ్, నల్లోళ్ల ప్రభురాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ పట్టభద్రులకు నాగర్‌కర్నూల్‌లో ఉద్యోగ అవకాశం

రోడ్డు భద్రతా సమన్వయకర్త పోస్టుకు నోటిఫికేషన్ విడుదల.. నెలకు రూ.40 వేల వేతనం



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్‌కర్నూల్): నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అర్హులైన ఇంజినీరింగ్ పట్టభద్రులకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ప్రాతిపదికన జిల్లా రోడ్డు భద్రతా సమన్వయకర్త (డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కోఆర్డినేటర్) పోస్టును భర్తీ చేసేందుకు నియామక ప్రకటన విడుదల చేసింది. మొత్తం ఒక పోస్టుకు అర్హులైన స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ పోస్టుకు సివిల్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ పట్టా కలిగి ఉండటంతో పాటు మెరుగైన విద్యా ప్రతిభ ఉండాలి. అభ్యర్థి నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన స్థానికుడై ఉండటం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.40 వేల కన్సాలిడేటెడ్ వేతనం చెల్లించనున్నారు. నియామక కాలపరిమితి ఒక సంవత్సరం. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, స్థానిక నివాస ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులను నాగర్‌కర్నూల్‌లోని ఐడీఓసీ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో గల గది నంబర్ +32, ఇన్‌వార్డ్/అవుట్‌వార్డ్ సెక్షన్‌లో సమర్పించాలి. జిల్లా కలెక్టర్ నియమించిన కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు నియామక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేద కుటుంబానికి ఇంటి నిర్మాణంలో ఉప్పల ట్రస్ట్ అండ

నిరుపేద ఇంటి ఫినిషింగ్ పనుల కోసం సిమెంట్ అందజేత



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి తలకొండపల్లి : నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరో కుటుంబానికి చేయూతనందించింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మల్లికేడి నాగేశ్వర్ కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ట్రస్ట్ ద్వారా సిమెంట్ అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఇంటి నిర్మాణంలో భాగంగా ఫినిషింగ్ పనుల కోసం అవసరమైన సిమెంట్‌ను అందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోలేని పరిస్థితిలో ఉన్న తమకు సహాయం అందించిన ఉప్పల వెంకటేష్‌కు నాగేశ్వర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ కటికల యాదయ్య, రాంపూర్ చెరువు జనరల్ సెక్రటరీ చిలుకం శేఖర్, మాజీ వార్డు సభ్యుడు మీసాల ఆంజనేయులు, యువ నాయకులు రొయ్యల రమేష్, కటికల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనంతారం రైతులకు 22-ఏ నిషేధిత జాబితా కష్టాలు



169 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

ప్రభుత్వ హామీ అమలులో జాప్యం.. రైతులకు న్యాయం చేయకపోతే పోరాటం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: గుమ్మడిదల మండలం అనంతారం గ్రామ పరిధిలోని 169 ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధిత రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 173లోని 59 ఎకరాలు, సర్వే నంబర్ 174/1 నుంచి 174/10 వరకు ఉన్న 110 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సీజీఆర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రైతుల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినప్పటికీ, నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో రైతులు తమ భూముల క్రయవిక్రయాలు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సంబంధిత 169 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధిత రైతులకు అండగా నిలిచి వారి హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున ఉద్యమిస్తామని చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, బండాల భాస్కర్, హనుమంతు పాల్గొన్నారు.

పటాన్‌చెరు కాంగ్రెస్ బలోపేతంపై కీలక చర్చ

ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో కాట శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి భేటీ

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 12: గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌ను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.





వైద్య ఖర్చులకు పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్: గోలి శ్రీనివాస్ రెడ్డి

ఎల్లికల్ గ్రామానికి చెందిన బాధితుడికి రూ.18 వేల ఆర్థిక సాయం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందిన పేదలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన ప్రభాతి రామస్వామి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఆయనకు రూ.18 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ నేపథ్యంలో గురువారం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును రామస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, వెల్దండ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పుట్ట రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు నాగులు నాయక్, లింగం, రాములు, ఎల్లికల్ సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, నరేష్, తలకొండపల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, ప్రవీణ్, రవి, సుమన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 14 నుంచి చండూరులో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**చండూరు, క్రైమ్ మిర్రర్ఃఃః

అయ్యప్ప దేవస్థానానికి "మాద్రి పృథ్వీరాజ్" రూ.7,00,116 విరాళం

మాద్రి పృథ్వీరాజ్ ను సన్మానించిన ఆలయ కమిటీ



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 12: దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడంలో ముందుండే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో నిర్మాణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థాన అభివృద్ధికి ఏడు లక్షల నూట పదహారు రూపాయలు భారీ విరాళాన్ని అందజేశారు. ముఖ్యంగా దేవస్థానంలో ద్వారపాలకుల మండపం నిర్మాణం కోసం ఈ మొత్తాన్ని అందించారు. ఈ నెల 22న నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని మాద్రి పృథ్వీరాజ్ దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ ఏర్పాట్లు, దేవస్థాన నిర్మాణ పనులు, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవస్థాన అభివృద్ధికి తనవంతు సహకారంగా రూ.7,00,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు దేవాలయాలు ప్రతీకలని అన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలకే పరిమితం కాకుండా భక్తి, ఐక్యత, సేవాభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే పవిత్ర కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు కొనసాగిస్తానని తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి రూ.7,00,116 విరాళం అందించిన మాద్రి పృథ్వీరాజ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అందించిన విరాళం ద్వారపాలకుల మండపం నిర్మాణంతో పాటు దేవస్థాన అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు, అయ్యప్ప స్వామి భక్తులు, ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రైతుల సహకారం అవసరం : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

- రీ సర్వే అభ్యంతరాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి
- సింగారంలో గ్రామ సభకు కలెక్టర్ హాజరు
- భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి



మునుగోడు క్రైమ్ మిర్రర్: రైతులందరూ సహకరిస్తేనే భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా, మునుగోడు మండలం, సింగారం గ్రామంలో భూముల రీ సర్వే పై జారీ చేసిన నోటీసులకు వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికై నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు.గ్రామంలో మొత్తం 255 ఖాతాలు ఉండగా, 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్ పి ఎం)లు ఇవ్వడం జరిగిందని, వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు స్థానిక తహసిల్దారు, చండూర్ ఆర్డీవో శ్రీదేవిలు జిల్లా కలెక్టర్ కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు రీ సర్వే కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించడం జరిగిందని, గ్రామ కంఠం సరిహద్దులు ,ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములు, ప్రభుత్వ భూములు అన్నింటిని సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగిందని, అయితే రీ సర్వే తర్వాత 59 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు.అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనివల్ల సమస్యలు పరిష్కారం కావాలని ,కొత్త సమస్యలు రాకూడదని, రైతులు సమస్వయంతో ప్రభుత్వానికి సహకరిస్తే ఏ గ్రామంలో భూ సమస్యలు ఉండవని తెలిపారు. చట్ట ప్రకారమే భూములకు హద్దులు నిర్ణయించడం జరుగుతుందని, ఎవరి భూములకు వారికి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకునేలా రైతులు చూడాలని, రానున్న రోజులలో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని, అందువల్ల రైతులు పక్కనున్న రైతులతో సామరస్య పూర్వకంగా చర్చించుకొని అనవసరమైన గొడవలకు వెళ్లకుండా భూ సమస్యలు పరిష్కరించుకునేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు .గ్రామంలో మిగిలిపోయిన సర్వేకు గ్రామస్తులందరూ సహకరించాలని, అందరూ సహకరిస్తే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టాల ప్రకారమే భూములకు హద్దులు నిర్ణయించి ఇవ్వాలని, అన్నదమ్ముల



భూముల పంచాయతీకి సంబంధించి తేడాలు వచ్చిన కేసులు , భూమి ఉండి పట్టా లేని కేసులు ,నక్ష మ్యాపు సర్వే మ్యాపులలో తేడాలు అసైన్డ్ భూములు , పట్టా భూముల వివాదాల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.రీ సర్వే చట్టం ప్రకారం ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని, చట్ట ప్రకారమే రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెల్లడించారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, స్థానిక సర్పంచ్ ఆండాలు, తహసిల్దార్ ,సర్వేయర్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై సమరశంఖం..

నల్లగొండ సభను విజయవంతం చేయండి!

రైతు హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న రైతుల బహిరంగ సభను విజయవంతం చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గుండాలలో రైతులతో కలిసి సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై రైతాంగం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని కోరారు. రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. వ్యవసాయ సబ్సిడీలను పెంచి రైతులను రుణవిముక్తులను చేయాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో చేపట్టే భూసేకరణకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందించేందుకు నల్లగొండలో జరిగే ఏఐకేఎస్ 36వ అఖిల భారత మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఈ మహాసభలు, నవంబర్ 15న జరిగే రైతుల బహిరంగ సభను విజయవంతం చేసేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలిరావాలని మద్దెపురం రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎండీ ఖలీల్, వికలాంగుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారం రమేష్, శాఖపురం లింగయ్య, అన్నెపర్తి లక్ష్మయ్య, అవిరెండ్ల అయిలయ్య, మల్లయ్య, తూనం నర్సయ్య, సోమయ్య, యాకన్న, ఎర్ర బుచ్చయ్య, నర్సమ్మ, లింగయ్య, బక్కయ్య, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

